ముద్దలు ముద్దలుగా దిగుతున్న చీకట్లోకి కళ్లు నిగిడ్చి చూస్తోంది ఇందిర—భర్త కోసం.

రోజూ ఏడు లోపలే వచ్చే ఆయన ఇంకా రాలేదు.

గోడ గడియారంలోని చిన్నముల్లు పదకొండు అంకెని కప్పేసింది.

ఎప్పుడయినా ఆలశ్యంగా వచ్చేమాటయితే ఫోను చేసి చెప్తారు. ఫోను చేసిన రోజయినా పది లోపల ఎట్టిపరిస్థితుల్లో వచ్చేస్తారు. కానీ... ఈ రోజు... ఫోనూలేదు... పదకొండయినా మనిషీ వత్తాలేరు...

గాభరాగా వుంది ఇందిరకి—

కాలనీ అంతా నిద్రలో సాగుతోంది. వీధి దీపాలు కూడా ఈ రోజు వెలగకపోవడంతో కాలనీ అంతా 'బ్లాక్ అవుట్'లా కనిపిస్తోంది.

నిశ్శబ్దం...

గుమ్మానికి జేర్లబడి దిగాలుగా ఎదురుచూస్తున్నయిందిర—రోడ్డుకవతల ఎదురింటి గుమ్మం దగ్గిర 'కేర్‌లెస్'గా నిలబడి సిగరెట్ పొగతో మేఘాలు సృష్టిస్తున్న 'బొమ్మల లుంగీ' తనవేపే కొరుక్కుతినేసేలా చూస్తున్నట్లు గమనించి, చటుక్కున లోపలికి జరిగి, తలుపులు చేరేసి, గదిలోని లైటు ఆర్పేసి, కిటికీ దగ్గరకుపోయి నిల్చుంది.

అంతలో నన్నని గాలి తెర... చల్లగా... అతి చల్లగా.

మరు నిముషానికి కమ్మని వాన వాసన...

ఇంకో నిముషానికి టపటప చినుకులు...

ఆయనకెంతో యిష్టమయిన వాతావరణం...

ఇప్పుడు తనకి భయాన్ని కొల్పుతోంది!!

వాన మొదలైతే... మొదలై హెచ్చితే... హెచ్చి రెచ్చిపోతే... ఆయన... పాపం ఆయన... వానలో ఎలావస్తారు? అసలే చీకటి... అందులో వర్షం... వీధులంతా గోతులు...

గాభరా... బెంగ... భయం... ఇందిర మనసు మనసులోలేదు.

ఒంటరితనం మొదట విసుగ్గానూ, ఆ తర్వాత భయంగానూ మారింది.

పిల్లలిద్దరూ వాళ్ల అమ్మమ్మగారి వూరెళ్లారు సెలవులకి.

ఇక్కడ—ఆయన, తనే.

ప్రస్తుతం తనొక్కతే... చీకట్లో... ఒంటరిగా...

'ట్రింగ్—ట్రింగ్'... 'ట్రింగ్—ట్రింగ్'...

నాలుగంగల్లో ఫోను దగ్గరికి గెంతి ఫోను అందుకుంది ఇందిర ఆనందంగా.

"హలో..."

"హలో... ప్రసాదరావుగారి యిల్లాండీ"—ఎవరిదో కొత్త గొంతు .

"అవునండీ..."

"వారి భార్య వున్నారా?"

"మాట్లాడుతున్నాను"

'మేం ఉస్మానియా హాస్పిటల్ నుంచి మాట్లాడుతున్నామండీ"

—అదిరిపడింది ఇందిర!!

"ఏ... ఏవిటండి?!"



'మేం ఉస్మానియా హాస్పిటల్ నుంచి మాట్లాడుతున్నాం. మీ భర్త ప్రసాదరావుగారికి యాక్సిడెంట్ అయ్యింది..."

"యాక్సిడెంటా?..." మెదడులో ప్రారంభమై, వెన్నుని వణికిస్తూ, పాదాలవరకూ పాకింది విద్యుత్తు—

"అవునండీ—ప్రాణభయంలేదు... కానీ బాగా దెబ్బలు తగిలాయి. ఇప్పుడే కాన్షస్‌లోకి వచ్చి మీ ఫోన్నెంబరు చెప్పారు. మీరు వెంటనే రండి... ఎమర్జెన్సీ వార్డులో వున్నారు పేషెంట్..." ఫోన్ పెట్టేశారు.

ఇందిర కాళ్లు కదిలిపోతున్నాయి—

తల తిరుగుతోంది—

అలాగే కుర్చీలోకి తూలిపడింది... 'ఆయనకి... ఆయనకి యాక్సిడెంట్'... .... పెదాలు వణికాయి... ఏం చెయ్యాలి?... ఊళ్లో తనకి బాగా ఆప్తులైనవాళ్లెవరూ లేరు. ఆయనకున్న ముఖ్యమైన స్నేహితులెవరో తెలియదు. ఒక ల్లిద్దర్ని తను ఎరిగున్నా వాళ్లిళ్లలో ఫోన్లు లేవు. ఈ పక్క యిళ్లవాళ్లెవళ్లూ సాయంచేసే స్వభావం వున్నవాళ్లు కాదు. అందులో అర్థరాత్రి... వానలో... ఒక్కరు కూడా తనతోరారు... ఏం చెయ్యాలి? హాస్పిటల్‌కి వెళ్లాలి. వేరే ఆలోచన అనవసరం—లేచి నిలబడింది ఇందిర. చీర మార్చుకోవాలనిగానీ, నిన్న ఫంక్షన్ కోసం వేసుకుని తీయకుండా వున్న నగలు తీయాలనిగానీ ఆమెకి అనిపించలేదు.

తలుపులు తీసింది.

వర్షం తెరలు తెరలుగా విసురుగా కురుస్తోంది.

గుండె ధైర్యం తెచ్చుకుని, తాళం తీసుకుని, తువ్వాలు వంటి మీద కప్పుకుని, గడపదాటింది ఇందిర.

ఇంటికి తాళంపెట్టి బయటికి అడుగుపెట్టగానే ఒక్కసారి వంటిమీద వడ్డజల్లుకి ఒళ్లు జలదరించింది. తలమీంచి కప్పుకున్న కొంగుని మునివంట నొక్కిపట్టి, ఓ చేత్తో కుచ్చిళ్లని ఎత్తిపట్టుకుని, కళ్లు పొడుచుకుచూస్తూ, జాగ్రత్తగా అడుగులు వేస్తూ మెయిన్‌రోడ్ వైపుకి నడక సాగించింది ఇందిర.

మెయిన్‌రోడ్డు మీద ఒక్క ఆటో కూడా లేదు. జన సంచారం అసలేలేదు. వాన హెచ్చుతోంది. ఆకాశం వుండుండి వికృతంగా ఉరుముతోంది.

రోడ్డు మీదకు వచ్చి చుట్టూ చూసింది ఇందిర బేలగా.

కొండచిలువలా నిటారుగా వున్న రోడ్డంతకీ తనొక్కత్తే!

అవసరమై గొంతు చించుకు అరిచినా ఎవ్వరూ సాయంరారు.

ఏందారి?

ఆయనకి ఎలావుందో?



—శ్రీమతి రాఘవ బాలకృష్ణ

తన కోసం కలవరిస్తున్నారేమో...

బాధతో మెలికలు తిరిగిపోతున్నారేమో...

హాస్పిటల్ చాలా దూరం... పది కిలోమీటర్లుందేమో.

చీకట్లో ఆశాదీపం... దూరంగా యిటేవస్తున్న వెలుతురు... ఆటోలా వుంది... ఆటో అయితే బాగుండును... ఆటోయే కావాలి... ఆటోయే... మెరుపుల్లో స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది... ఇటే వస్తోంది... వచ్చేస్తోంది... ఇందిరలో కొత్త భయం పొటమరించింది... అది ఖాళీది కాకపోతే... అందులో రౌడీలుంటే... ఎందారి?... ఆడ మనిషి. ఈ సమయంలో వంటరిగా దొరికితే వీళ్లు వదుల్తారా... పారిపోతే? దొక్కుంటే... ఛఛఛ... ఈ ఆలోచన అనవసరం—అది దేవుడి దయవల్ల ఖాళీ ఆటోయే అయి వుంటుంది... చూద్దాం... అడ్డం నిలబడదాం... ఆపితీరాలి... తను వెళ్లితీరాలి!

ఆగింది ఆటో.

ఆటోలోంచి ఓ తలలాంటి 'ఘనపదార్థం' రివ్వున ప్రక్కనుంచి బయటికొచ్చి, వినుగ్గా చూసింది.

ఒళ్లు భయంతో జలదరించింది ఇందిరకి.

ఆ పదార్థాన్ని పరికించి పరిశీలనగా చూసింది, ధైర్యంచేసి.

పక్షిగూటిని గుర్తుచేస్తోంది ఆ పదార్థం. అందులో కళ్లు లాంటివి, ముక్కు లాంటివి, చెవుల్లాంటివి... కనిపిస్తున్నాయి. నోరు కనపడటంలేదు. నుదురిని కప్పినది జుట్టే! ముఖాన్ని సగంపైగా కప్పినది గడ్డమే...

"ఏం కావాలి?" కరుకుగా వచ్చిన స్వరంతోపాటు, ఇప్పుడు తెరుచుకున్న నోరు లాంటిది కూడా కనిపించింది... ఆటో ఎక్కాలా? మానాలా? మనిషి రాక్షసుడిలా వున్నాడు.

"ఏం కావాలంటే?" కనురులాంటి ప్రశ్న.

"నా భర్త... హాస్పిటల్లో వున్నారు... యాక్సిడెంటయింది..." మాటలు తడబడ్డాయి.

ఒకసారి ఆమెని ఆపాదమస్తకం చూశాడు డ్రైవర్.

"తడిసిపోతున్నావు... లోపలకెక్కి కూసో"

ఆటోలోకి ఎక్కింది ఇందిర.

"ఇప్పుడు సెప్పు... ఏంటి యినయం?" అతని చూపులు ఆమె శరీరం మీద పాకుతున్నాయి. అతను మెడకు చుట్టుకున్న మఫ్లర్ పాములావుంది.

"'నా భర్తకి యాక్సిడెంటయ్యింది...'' గొంతు పెకల్చుకుని, భయంగా చెప్పింది.

"ఊ... అని దీర్ఘంగా ఆలోచించి, ఒళ్లు విరుచుకుంటూ బీడీ నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్ల గీసి, జేబులోని నోట్లవైపొకసారి చూసుకుని "ఎంతా...?" అన్నాడు బిజినెస్ లైపులో.

"ఊ. మీటర్ వేస్తావుగా... రెండు రూపాయలు ఎక్కువిస్తాను ప్లీజ్..."

దెబ్బతిన్నాడు డ్రైవర్.

"ఏడకి ఎల్దాం అంటావు?" అన్నాడు అర్థంకానట్లు.

"ఉస్మానియా హాస్పిటల్‌కి... ఆయనకి చాలా సీరియస్‌గా వుందిట—అర్జంటుగా వెళ్లాలి"

అగ్గిపుల్ల వెలుతురులో ఆమె మొహంలోని అభ్యర్థనని చదివాడు. తెల్లబోయి, సర్దుకుని తలాడించి, బీడీని వెలిగించుకుని, ఆటోని ముందుకు పురికించాడు.

అతని ముఖంలో రంగులు మారుతున్నాయి.

స్పీడుగా నడుస్తోంది ఆటో.

గతుకుల్లో ఎగురుతోంది.

వానజల్లు ఒకసారి ఇటునుంచీ మరోసారి అటునుంచి లోపలికి కొడ్తోంది. ఇందిర కాళ్ల దగ్గిర చీర తడిసి బరువుగా క్రిందికి గుంజుతోంది.

వాన మరీ రెచ్చిపోతోంది.

గుప్పుగుప్పున వదుల్తున్నాడు బీడీ పొగని డ్రైవరు.

పొగ వదుల్తున్నప్పుడు ఏదో వాసన కూడా వస్తోంది.

తనకి ఉస్మానియా హాస్పిటల్‌కి దారి సరిగ్గా తెలియదు—అందులో అర్థరాత్రివేళ అన్ని వీధులూ ఒకలాగే కనిపిస్తాయి—ఏదారిన తీసుకువెళ్తున్నాడో—అసలు ఎటు తీసుకువెళ్తున్నాడో—ఆయనకెలావుందో...!

ఇందిర గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి—కాలేజీ డిబేట్‌లో తను అర్థరాత్రి ఆడది ఒంటరిగా తిరగ్గలదని వాదించి బహుమతి పొందింది. కానీ నిజానికి అది వచ్చి అబద్ధం అని ఇప్పుడనిపిస్తోంది. ఆడదేవిటి మగాళ్లకే భయంకొలిపే రాత్రివేళ... ఈ వానలో ఇలా తనొక్కర్తె... ఇంత భయంకరమైన వ్యక్తి నడుపుతున్న ఆటోలో... డిబేట్‌లో సుందరి చెప్పింది రైటు... ఏమయినా ఆడది ఆడదే!

ఆటో ఆగింది.

ఇంజనూ ఆగింది.

"ఏమయ్యింది?" గాభరాగా అంది ఇందిర.

"ఏంకాలా?" నిర్లక్ష్యంగా వచ్చింది జవాబు. ఆపైన బీడీని వినురుగా నీళ్లల్లో పడేసి, క్రిందికి దిగి, సీటుక్రింద ఏదో ఇటూఅటూ ఇంజను తాలూకు పార్టులని కదుపుతున్నాడు డ్రయివరు. మధ్యమధ్యలో ఏదో సణుక్కుంటున్నాడు.

"ఏమయ్యింది? ఇప్పుడు బాగవుతుందా?"—గొంతు వణకకుండా జాగ్రత్తపడుతూ ఇందిర.

"అవుద్దమ్మా—సూత్తన్నాగా—మాటాడకుండా కూకో" అని నిటారుగా నిలబడి చుట్టూ చూస్తున్నాడు.

ఇందిరకి గుండెలు జారెత్తిపోతున్నాయి.

'వీడెవడో నిలువునా ప్రాణాలుతీసే హంతకుడిలా వున్నాడు. తన మెళ్లోని చంద్రహారం గొలుసు మీద వీడిదృష్టి పడేవుంటుంది. ఇప్పుడు ఆ గొలుసు, మంగళసూత్రం కోసం తనగొంతు నొక్కెయ్యొచ్చు. లేకపోతే అవి లాక్కుని తనని మానభంగం చేసి పోవచ్చుకూడా...' కన్నీళ్లు జర్రునజారాయి.

ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి డ్రయివరు ఆఖరి ప్రయత్నంగా మరోసారి ప్రయత్నించేసరికి "బర్ర్..." మని పొగలుకక్కుతూ ఇంజన్ స్టార్ట్ అయింది. గబుక్కున లోపలకూర్చుని ముందుకి ఉరికించాడు.. "అర్జంటనేసరికి మరింత ఆలస్యమవుద్ది ..." అంటూ.

ఇంకోసారి ఆటో ఆగలేదు—

వాన మాత్రం క్రమేపీ తగ్గుముఖంపట్టి అయిదు నిముషాల్లో ఆగిపోయింది—

హాస్పిటల్ చేరింది ఆటో.

ఆటో దిగి పర్సులోంచి యాభయి రూపాయాలనోటు తీస్తూ "చిల్లర వుందా" అంటూ అతని ముఖంలోకి చూసిన ఇందిర విస్తుపోయింది—ఇందాక భయంకరంగా కనిపించిన అతని ముఖం ఇప్పుడెందుకు ప్రశాంతంగా కనిపిస్తోంది. అతనిలో ఒక సోదరుడు కనిపిస్తున్నాడు—ఒక మంచి మిత్రుడు కనిపిస్తున్నాడు.

జేబు రుమాలుతో తల, ముఖం తుడుచుకుంటున్నాడు డ్రయివరు.

అతనివైపు కృతజ్ఞతగా చూస్తూ, అతన్ని తప్పుగా వూహించుకున్నందుకు బాధపడ్తూ, నోటుని అతనివైపు చాపింది ఇందిర—చిల్లర తెచ్చుకోనందుకు బాధపడ్తూ.

"సిల్లర లేదమ్మా..."

"అలాగా—నా దగ్గరా ఇంకొక వంద రూపాయలు నోటు వుంది. పోనీ... ఈ నోటు నువ్వు..."

"వర్లేదమ్మా—ముందు మీరు లోనకి నడవండి. మగతోడు లేకుండా ఇంత కష్టంలోవున్నారు పాపం—నడవండి. హాస్పిటల్లో సాలామంది నర్సులూ ఆళ్లూ నాకు పరిచయం వున్నారు. అయ్యగార్ని జాగ్రత్తగా సూడమని సెప్తాను. డబ్బులకేవుంది, రేపొద్దున్నేవైనా తీసుకుంటాను..." అంటూన్న అతని నుంచి లభించిన సానుభూతికి కళ్ల నీళ్లయిపోయింది ఇందిర—హాస్పిటల్ లోనికి నడుస్తూ.

* * *

గంటసేపు మొత్తిన వర్షం తెరిపి యిచ్చి

నందుకు సంతోషపడుతూ, క్లబ్బువాలు బయటకు వచ్చిన సుందరి వాచీ చూసుకుంది.

—పన్నెండు!

హాలు లోంచి బయటికివస్తున్న ఖరీదైన దీపాల కాంతి వీధి మీదికి కూడా పల్చగా పరుచుకుంది.

వర్షం కారణంగానో ఏమో బయట ఒక ఆటో కూడా లేదు. ఆటో కోసం వీధి పొడవునా చూపుసారించింది. ఆటో కనబడలేదు. క్రిందికి దిగి చూద్దామని మేడమెట్లు దిగింది. మూడుగంటల క్రితం పార్టీలో తీసుకున్న డ్రింకు తాలుకు మత్తింకా దిగలేదు. ఒళ్లు స్వల్పంగా తూలుతోంది. ఫ్రెండ్స్ అంతా ఈ రాత్రికి క్లబ్బులోనే వుండిపొమ్మన్నారుగానీ—తనకిష్టం లేదు. ఒంటరిగా ఇంటికి ఎలావెళ్తావు అన్నారు—పిరికి సన్నాసులు! ఆడది మగాడితో సమానం కాదూ... ఎందుకు వెళ్లలేదు తను? అయినా తనేం గంగానమ్మలా నగలు దిగేసుకుని తిరగదు కదా!

క్రిందికి వచ్చి వీధిలోకి నడిచింది సుందరి. నేలంతా చిత్తడిగా వుంది.

'ఇంకా నయం—వానలేదు—తెల్లచీరంతా పాడయి పోయేది' అనుకుంది. నీలంపూల తెల్లషిఫాన్ చీర, స్లీవ్‌లెస్ జాకెట్, దువ్వకోకుండా భుజాలమీదకి వదులుకున్న బాబ్డ్‌హెయిర్... ఈ రోజు తనకే ముద్దొచ్చేట్టు వుంది తను.

'నేనెన్నటికీ తనమీదే డిపెండ్ అవుతున్నాననుకుంటున్నారు కామేశ్. తన పద్ధతులు నచ్చవా... కారు తేనంటాడా... తాళి కట్టినంత మాత్రనా తన మీద సర్వహక్కులూ వున్నాయనుకుంటున్నారు కాబోలు—ఇప్పుడు బుద్దొస్తుంది! ఏ ఆటోలోనో ఒంటరిగా యింటికి వచ్చిన తన్ను చూసి తెల్లముఖం వేస్తాడు.'

అలా అయిదు నిముషాలు నిలబడింది సుందరి. ఒక్క ఆటో కూడా రాలేదు. 'వెధవ సిటీ—టాక్సీలయినా దొరకవు రాత్రుళ్లు కూడా' అని విసుక్కుంటూ, నాలుగు అడుగులు వేసిచూద్దాం అన్నట్లుగా నడవసాగింది—

'రిక్షామ్మా' అన్నాడు ఓ ముసలి రిక్షావాడు దగ్గరకొచ్చి

"వద్దు—వెధవరిక్షా—నడుం పట్టేస్తుంది—పైగా గంటసేపు కూచోవాలి" అని విసుక్కుంది.

ఓ ఖాళీ ఆటోలా వుంది—వస్తోంది.

చెయ్యివూపి ఆపింది ఆటోని.

ఆటోలోంచి ఒక తలలాంటి ఘనపదార్థం ప్రక్కకి వంగి "ఎక్కడికి" అని ప్రశ్నించింది. పూర్తిగా తడిఆరని జుట్టు ముఖంమీద పడుతూంది. మొహం అంతా జుల్ఫే. మెళ్లోంచి పాములా నల్లని మఫ్లర్ వేల్లాడుతుంది.

చీదరగా చూసింది సుందరి వాడివైపు.

కొంచెం శుభ్రమయిన ఆటోవాడు దొరకకూడదూ అని లోలోనే విసుక్కుని, ఎక్కడికి వెళ్లాలో చెప్పింది.

"అమ్మో చాలాదూరం కదా!" అన్నాడు డ్రయివరు—గరగరలాడే గొంతుతో.

"అందుకనే కదా ఆటో ఎక్కేది!" కసురుతున్నట్లు అంది సుందరి.

"అట్టాగా" అని ఓసారి ఆమెని ఆపాదమస్తకం కళ్లతో తడిమాడు డ్రయివరు—"ఎక్కండి" అన్నాడు.

సుందరి ఆటోలోకి ఎక్కికూర్చుంది.

ఆటో నడుస్తోంది.

"ఏ దారమ్మట పోనీయమంటారు?"

"ఏదయినా సరే—దగ్గరదారి చూడు" అంటూ ఆమె అవలీలగా అవుకునే ప్రయత్నం చేసింది. కానీ—ఆమె నోటి నుంచి వచ్చిన ఖరీదైన ఆల్కహాలు చిరువాసన అతన్ని చేరనేచేరింది.

"దగ్గిర దారంటే సందుగొందుల్లోంచి ఎల్లాలిమరి—మీకు భయంలేదంటే..."

"నాకేం భయంలేదు—పోనియ్యి. పెద్ద వీధులన్నీ ఎవరు తిరుగుతారు?"

"సరే మీ యిష్టం"

బీడీ వెలిగించాడు డ్రయివరు.

ఆమెని ఏదో అడుగుదామని రెండుసార్లు ప్రయత్నించి మానేశాడు. మూడవసారి తెగించి అడిగేశాడు.

"క్లబ్బుకొచ్చారా?"

"అవును—నేను క్లబ్బు మెంబర్ని..".

"ఒక్కరే వెళ్తున్నారేం?"

"ఒక్కర్తి నైతేనేం—పదిమంది తోడు కావాలా?"

ఏదో అర్థమయినట్లు తలూపి పొగ హుషారుగా వదుల్తూ నడుపుతున్నాడు ఆటోని.

సుందరి ఏదో ఇంగ్లీషు ట్యూన్ని హమ్ చేస్తోంది. ఆమె అలా హమ్ చేయటంలోనూ, కేర్‌లెస్‌గా జవాబులు చెప్పటంలోనూ తనంటేగాని, ఒంటరి ప్రయాణం అంటేగాని ఏమీ భయపడటంలేదని తనకి తెలియజేయాలనే ప్రయత్నమేనని సులువుగా గ్రహించాడు అతను.

ఆమె బట్టలనుంచి వస్తున్న సెంటువాసనని బలంగా పీల్చుతూ హుషారుగా మలుపులు తిప్పుతూ నడుపుతున్నాడు బండిని.

ఆటో ఆగింది.

"ఏమయ్యింది" అంది సుందరి.

"బండి ఆగింది"

"అది తెలుసు—ఎందువల్ల"

"ఎందుకంటే నూత్తేకదా నాకూ తెలిసేది" అంటూ డ్రయివరు సీటు ఎత్తి ఏదో తడమసాగాడు.

"ఆటోని కండిషన్లో ఎందుకు పెట్టుకోరయ్యా మీరు నాకు తెలీక అడుగుతాను—చూడు యిప్పుడు నాకెంత టైంవేస్టో. ఛ ఛ" విసుక్కుంది సుందరి.

ఏం మాట్లాడకుండా తనపని చూసుకుంటూ ఓ కంట ఆమెని గమనిస్తున్నాడు... అచ్ఛాదనలేని ఆమె జబ్బల్ని, ఆమె పల్చనిచీరను, ఆమె మెడని, భుజాల్ని మార్చిమార్చి చూస్తున్నాడు...

అయిదు నిముషాలకి స్టార్టయింది ఆటో.

సుందరికి కాలేజీ డేస్‌లో ఆడది ఒంటరిగా అర్ధరాత్రి తిరగ్గలదని వాదించిన ఇందిర గుర్తొచ్చింది. తను తిరగలేదు అని వాదించి ఓడిపోయింది. ఇందిర చెప్పింది నిజమే. ఇప్పుడు తను తిరగడంలేదూ! భయపడుతూ యింటిదగ్గర కూర్చుంటే భయమే మిగులుతుంది. ఒంటరిగా వెళ్లటం ఎంత 'థ్రిల్లింగ్'గా వుంటుంది! అయినా ఆధునిక ఆదర్శ మహిళగా, మహిళామండలి సెక్రటరీగా తను ఈ మాత్రమయినా సాహసం చేసి చూపించకపోతే ఎలా! ఇంటికెళ్లాక శ్రీమాన్ భర్తగారి ముఖారవిందాన్ని చూడాలి—నల్లగా... సెనగలా... నవ్వు తెరలు తెరలుగా వచ్చింది సుందరికి. అలా నవ్వుతూనే... ఆటో ఒక నిర్జనప్రదేశంలో ఒక పాత మేడవైపుకి తిరగడం... ఆ కాంపౌండులోకి వినురుగా దూసుకుపోవడం గమనించింది సుందరి.

"ఏయ్... ఇటెటు...?" అరిచింది సుందరి.

"అరెచుప్" కసిరాడు డ్రయివరు.

"ఏయ్—నిన్నే. ఏం నాటకం ఆడుతున్నావ్? ఆపు ఆటోని... నేనెవరనుకుంటున్నావు? మా ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలుసా?...

ఆటో ఆగింది... "నువ్వెవరివో తెలిసిందిగానీ—దిగెహే..." అంటూ, 'కీచు'మని అరుస్తున్న ఆమెని రెక్కపుచ్చుకులాక్కుని, భుజాలమీద వేసుకుని, హుషారుగా, కోరికతో కాలిపోతూ, పశువులా నవ్వుతూ, ఆ పాత మేడమెట్లెక్కసాగాడు డ్రయివరులో మేల్కొన్న 'రాక్షసుడు'.

ఆమె గింజుకుంది...

అరిచింది...

రక్కింది...

కొరికింది...

ఫలితం శూన్యం!

అతని పశుబలం ముందు ఓడిపోయింది!!

స్పృహతప్పిపోయిన సుందరిని అలాగే వదిలిపెట్టి, లేచి "ఇంటికిపోయి ఓ నాలుగ్గంటలు పడుకుని, ప్రొద్దునే అన్నట్లికి ఎల్లాలి. పాపం ఆ బాబుకెలావుందో—ఆ అమ్మకేమన్నా కావాలేమో సూడాలి" అనుకున్నాడు డ్రయివరులోని 'మానవుడు'. □



గాయని

**షేక్ మస్తాన్‌బీ**

తెనాలి శ్రీ త్యాగరాజ సంగీత కళాశాల విద్యార్థిని కుమారి షేక్ మస్తాన్ బీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సంగీత పోటీలో ప్రథమ బహుమతి పొందింది. ఆమె బాల్యం నుంచి తన తండ్రిగారైన షేక్ మహమ్మద్ రసూల్ వద్ద సంగీత సాధన చేశారు. శాస్త్రీయ సంగీతంలో ఆమె గురువులు—శ్రీయుతులు విష్ణుభట్ల శ్రీరామమూర్తి, శిష్ట్లా రమణమూర్తి, చావలి హనుమచ్ఛాస్త్రి, మీరాసాహెబ్, ముళ్ళపూడి కామేశ్వరరావుగార్లు. మస్తాన్‌బీ బి. ఏ. పట్టభద్రురాలు. గుంటూరు లయన్స్ క్లబ్ నిర్వహించిన పోటీలలో రెండుసార్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన షేక్ మస్తాన్ బీ పలు సంగీత పోటీలలో బహుమతులందుకున్నది.

—షేక్ మీరాసాహెబ్